# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 226 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 13 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## లెజెండరీ సింగర్
# ఆశా భోంస్లే కన్నుమూత

### ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

**కన్నీళ్లతో ప్రకటించిన భోంస్లే కుమారుడు, మనవరాలు.. సోమవారం శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు**

**20కి పైగా భాషల్లో 12,000 పాటలు పాడిన గాన దిగ్గజం**



**ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు**

ఆశా భోంస్లేకు ప్రముఖుల సంతాపం

**ముంబై, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోంస్లే.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోంస్లే, మనవరాలు జానై భోంస్లే ధృవీకరించారు.

ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దిగ్గజ గాయని లతా మంగేష్కర్‌కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్ లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. 1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు.

..మిగతా 2లో



# ఇంటర్ ఫలితాలు విడుదల

**సెకండియర్‌లో అత్యధిక పాస్ పర్సంటేజ్.. మళ్లీ సత్తాచాటిన బాలికలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఫస్ట్ ఇయర్, సెకండియర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. ఈసారి ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్ చూసుకునేందుకు తెలంగాణ ఇంటర్ బోర్డు టెక్నాలజీని ఉపయోగించింది. సులువుగా ఫలితాలు చూసుకునేందుకు తొలిసారి వాట్సాప్‌లో కూడా తెలంగాణ ఇంటర్ రిజల్ట్స్‌ను చెక్ చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు ఇవాళ తమ ఫలితాలు చూసుకుంటున్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు రిలీజ్ అయ్యాయి. ఉదయం 11 గంటలకు తెలంగాణ ఇంటర్ బోర్డు.. ఫలితాలను విడుదల చేసింది. రాష్ట్రంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ కలిపి మొత్తం దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక సెకండియర్‌లో 70.58 శాతం మంది స్టూడెంట్స్ పాస్ అయ్యారు. ఇక ఈసారి పరీక్షలు జరిగిన 25 రోజుల్లోనే రిజల్ట్స్‌ను విడుదల చేయడం విశేషం.

ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక

..మిగతా 2లో

### మహిళల ఆకాంక్షలకు
## రిజర్వేషన్ బిల్లు ప్రతీక

**మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ బిల్లుకు మద్దతివ్వాలి: బండి సంజయ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలని కోరారు. ఈ బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలే బుద్ధి చెబుతారని అన్నారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనేది దశాబ్దాల నాటి కల అని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాజకీయాలకు

..మిగతా 2లో

# ఇస్లామాబాద్ శాంతి చర్చలు విఫలం

**అమెరికా తమ నమ్మకాన్ని గెలవడంలో విఫలమైందన్న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘలీబాఫ్**

**తమ షరతులను ఇరాన్ అంగీకరించలేదంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆరోపణ**

**అణ్వాయుధాలు తయారు చేయబోమని దీర్ఘకాలిక హామీ ఇవ్వాలని అమెరికా డిమాండ్**

**ఇప్పటికే తమ తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచామని వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాల మధ్య పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు ముగిశాయి. చర్చల అనంతరం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మీడియాతో మాట్లాడుతూ, అమెరికా, ఇరాన్ మధ్య ఎలాంటి ఒప్పందం కుదర్లేదని చెప్పారు. అమెరికా మితిమీరిన డిమాండ్లను నియంత్రించుకుని, ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను అంగీకరించాల్సి ఉంటుందని ఇరాన్ పేర్కొంది. 'మేం గత 21 గంటలుగా చర్చలు జరుపుతున్నాం. కానీ, బ్యాడ్ న్యూస్ ఏంటంటే,

..మిగతా 2లో

### క్యాతనపల్లిలో
## ప్రజాస్వామ్యం గెలిచింది

**మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ కోసం మంత్రి వివేక్ ఎన్ని అడ్డదారులు తొక్కినా.. ఎంత భయపెట్టినా బీఆర్ఎస్ కౌన్సిలర్లు లొంగలేదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మొక్కవోని ధైర్యంతో అధికార బలానికి ఎదురొడ్డి నిలిచి, ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని వ్యాఖ్యానించారు. మంచిర్యాల జిల్లాలో బీఆర్ఎస్ కారకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చారని కానీ.. మంత్రి వివేక్ అధికార

..మిగతా 2లో



### బీహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు
## రంగం సిద్ధం

**ఏప్రిల్ 13 తర్వాత ప్రక్రియ ప్రారంభం**

**రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత**

**ఏప్రిల్ 13 తర్వాత ప్రక్రియ ప్రారంభం**

**జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ సభ్యత్వాన్ని స్వీకరించి, శాసన మండలికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీజేపీ, జేడీయూ నాయకులు ఆయనతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ, భవిష్యత్ వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఈ

..మిగతా 2లో



## సిలిగుఢి కారిడార్‌ను విడదీస్తామని 'తుక్డే-తుక్డే' గ్యాంగ్ బెదిరిస్తోంది: మోదీ

**తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ప్రధాని నరేంద్ర మోదీ**

**ఉత్తర బంగాల్‌ను నిర్లక్ష్యం చేసి మదర్సాలకు సుమారు రూ. 6,000 కోట్లు కేటాయించారని విమర్శ**

2లో..

## బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్పు గురించి పరిశీలిస్తాం: కేటీఆర్

**మంచిర్యాల జిల్లాలో క్యాతనపల్లిలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించిన కేటీఆర్**

**అన్ని పథకాల్లో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందంటూ అధికార పక్షంపై విమర్శలు**

**గతంలో తాము చేసిన లోపాలను సరిదిద్దుకుంటామని వెల్లడి**

2లో..

# ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు.. ఆశా భోంస్లేకు ప్రముఖుల సంతాపం

**ముంబై, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూశారు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

'ఆశా భోంస్లే మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆశా భోంస్లే జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి'

**- ప్రధాని నరేంద్ర మోదీ**

'ఆశా భోంస్లే మరణ వార్త విని బాధపడ్డా. ఆమె ఓ దిగ్గజ గాయని. అత్యధిక పాటలు పాడి చరిత్ర సృష్టించారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు మ్యూజిక్ ఇండస్ట్రీకి సేవలందించారు. భారతీయ సంగీత జగత్తులో ఆమె పాటలు తరతరాలపాటు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆశా కుటుంబానికి, ఆమె అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

**- ఏపీ సీఎం చంద్రబాబు**

"ప్రముఖ గాయని, జాతీయ పురస్కార గ్రహీత, పద్మ విభూషణ్ ఆశా భోంస్లే లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలు, దశాబ్దాల పాటు పలు భాషల్లో ప్రదర్శించిన అపూర్వ ప్రతిభ చిరస్మరణీయం. ఆమె మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా"

**- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**

"ఆశా భోంస్లే గాత్రం తరతరాల పాటు అనేక రకాల భావోద్వేగాలను పలికిస్తూ, భారతీయ సినిమాకు ప్రత్యేకంగా నిలిచింది. ప్రతి పాటకూ గ్రేస్ తీసుకువచ్చిన ఆమెను ఎప్పుడూ ఆరాధిస్తా. భారతీయ చిత్ర పరిశ్రమ భర్తీ చేయలేని ఓ స్వరాన్ని కోల్పోయింది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

**- చిరంజీవి**



'ఆశా భోంస్లే మరణవార్త విని తీవ్రంగా దుఃఖిస్తున్నా. ఆమె మధురమైన స్వరం దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు ప్రాణంగా నిలిచి, లక్షలాది హృదయాలను తాకింది. తరతరాలు నిలిచిపోయే జ్ఞాపకాలను వదిలివెళ్లారు. ప్రేమ, గౌరవంతో ఆమెను ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటాం. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి'

**- ఎన్టీఆర్**

"గొప్ప గాయని ఆశా భోంస్లే మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తరతరాలుగా తన పాటతో ఎంతోమంది హృదయాలను మంత్రముగ్ధులను చేసిన గాయని. ఎన్నో బెంగాలీ పాటలను కూడా ఆమె పాడారు. 2018లో రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారం 'బంగ బిభూషణ్'ను ఆమెకు ప్రదానం చేశాం. ఆమె కుటుంబం, అభిమానులు, మొత్తం సంగీత పరిశ్రమకు నా సానుభూతి వ్యక్తం చేస్తున్నా"

**- మమతా బెనర్జీ**

'భారతీయ సంగీత ప్రపంచంలో ఒక గొప్ప కంఠం ఈరోజు మూగబోయింది. ఆమె తన పాటలతో తరతరాలకు ఆనందాన్ని పంచారు. లెక్కలేనన్నీ భావోద్వేగాలను స్పృశించారు. లతా దీదీ తర్వాత సంగీత పరిశ్రమలో ఒక గొప్ప శకానికి మూల స్తంభంలా నిలిచారు. ఆమె మరణంతో నేడు అది కూలిపోయింది'

**- శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే**

# ఇస్లామాబాద్ శాంతి చర్చలు విఫలం

**మొదటి పేజీ తరువాయి...**

మా మధ్య ఎలాంటి ఒప్పందం కుదర్లేదు' అని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మీడియాకు వెల్లడించారు.

అమెరికా తన "రెడ్ లైన్స్" (దాటకూడని హద్దులు) స్పష్టం చేసిందని, అయితే ఇరాన్ "మా షరతులకు అంగీకరించలేదు" అని ఆయన పేర్కొన్నారు.

అదే సమయంలో, ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిఫ్ మునీర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'చర్చలు సఫలం కాకపోవడానికి పాకిస్తానీలు ఏమాత్రం కారణం కాదు. వారు తమ వంతుగా చాలా గొప్పగా ప్రయత్నించారు' అని అన్నారు.

'ఇరాన్ నుంచి ఆ హామీ కావాలి'

'అమెరికా పట్టువిడుపులతో, మంచి ఉద్దేశంతోనే చర్చలకు వచ్చింది. కానీ, దురదృష్టవశాత్తూ ఇరుపక్షాలు ఎలాంటి ఒప్పందానికి రాలేకపోయాయి. పాకిస్తాన్ నుంచి మా బృందం తిరుగు పయనం అవుతుంది. ఇదే మా చివరి, అత్యుత్తమ ఆఫర్ అని వారు అర్థం చేసుకోవాలి. దీనికి ఇరాన్ అంగీకరిస్తుందో లేదో చూడాలి' అని వాన్స్ అన్నారు.

ఇరాన్ అణు సామర్థ్యంపై మీడియా ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

'ఇరాన్ అణ్వాయుధాల జోలికి వెళ్లదని, వాటి తయారీకి అవసరమైన పరికరాలను సేకరించబోదని వారి నుంచి మాకు ఒక కచ్చితమైన హామీ కావాలి. ఇదే ట్రంప్ ప్రధాన లక్ష్యం. ఇరాన్ అణు కార్యక్రమం ఇప్పటికే ధ్వంసం అయింది. భవిష్యత్‌లో అణ్వాయుధాలను తయారు చేయమని వారు హామీ ఇవ్వాలి. ఇరాన్ నుంచి అలాంటి హామీ ఇంకా రాలేదు. భవిష్యత్‌లో వస్తుందని ఆశిస్తున్నాం.

అణు సమస్యలతో పాటు మరెన్నో అంశాలపై మేం మాట్లాడాం. కానీ, మా షరతులకు ఇరాన్ అంగీకరించే పరిస్థితి మాత్రం కనిపించలేదు. మేం ఈ చర్చలకు చాలా పట్టువిడుపులతో వచ్చాం. వారి పరిస్థితిని అర్థం చేసుకుని సర్దుబాటు చేసుకునేందుకు కూడా సిద్ధపడ్డాం' అని వాన్స్ వ్యాఖ్యానించారు.

ఇరాన్ ప్రకటనలో ఏముంది?

అమెరికాతో జరిగిన శాంతి చర్చలపై ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బకేయి తాజాగా ఒక ప్రకటన విడుదల చేశారు.

'సమగ్ర చర్చలు జరిగాయి. అయితే, ఈ చర్చలు విజయవంతం కావడం అనేది ఎదుటి పక్షం (అమెరికా) ఎంత సీరియస్‌గా ఉంది, ఏ ఉద్దేశంతో ఉందనే దానిపైనే ఆధారపడి ఉంటుంది' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

అమెరికా తన మితిమీరిన డిమాండ్లను, చట్టవిరుద్ధమైన కోరికలను మానుకోవాలని పేర్కొన్న ఆయన.. ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను, దేశ ప్రయోజనాలను అమెరికా అంగీకరించాలని కోరారు.

హోర్ముజ్ జలసంధి, ఇరాన్ అణు కార్యక్రమం, ఇరాన్‌లో యుద్ధానికి పూర్తిగా ముగింపు పలకడం వంటి అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

జేడీ వాన్స్ మీడియాతో మాట్లాడటానికి ముందే ఇరాన్ నుంచి ఈ ప్రకటన వచ్చింది.

సుదీర్ఘంగా సాగిన చర్చలు

ఈ ప్రకటనలకు ముందు, ఇస్లామాబాద్‌లో సమయం ఉదయం 04:50 గంటలు - భారత కాలమానం ప్రకారం ఉదయం 5.20 గంటల సమయంలో చర్చల ప్రస్తుత పరిస్థితి గురించి అడిగినప్పుడు, చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని వైట్‌హౌస్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు తనతో చెప్పినట్లు బీబీసీ యూఎస్ రిపోర్టర్ క్రిస్టర్ హేజ్ తెలిపారు.

"15 గంటలుగా చర్చలు నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయి" అని వైట్‌హౌస్ అధికారి చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు.

ఈ చర్చలకు సంబంధించి ఇస్లామాబాద్ నుంచి ఉదయం 3 గంటల సమయంలో దక్షిణాసియా కరెస్పాండెంట్ ఆజాదే మోషిరి కథనం ప్రకారం, ఇరుపక్షాల మధ్య చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, శనివారం నాటికి అసలు ఇరాన్, అమెరికా ప్రతినిధి బృందాలు ఈచర్చలకు హాజరవుతాయా లేదా అనే విషయంలో సందేహం ఉండేది.

# బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా పేర్కొన్నారు. అయితే ఆ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఆదివారం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌ను కలిసిన అనంతరం సంజయ్ ఝా విలేకరులతో మాట్లాడారు.

"బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడేందుకు వీలుగా, నీతీశ్ ముఖ్యమంత్రి త్వరలో పదవి నుంచి వైదొలుగుతారని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని నేను భావిస్తున్నా"

- సంజయ్ కుమార్ ఝా, జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు

అయితే, సంజయ్ ఝా వెంట ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జేడీయూ సీనియర్ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ చౌదరి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ సిఫార్సు మేరకు ఎన్‌డీఏ శాసనసభ్యులు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని తెలిపారు. "కొత్త ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ విషయాల్లో వారికి ఒక నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. వారు తమ ప్రణాళికతో ముందుకు వచ్చిన తర్వాత, తదుపరి చర్యలు జరుగుతాయి. బిహార్‌లో మొదటి సారిగా బీజేపీ ముఖ్యమంత్రి పదవిని పొందేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ అభ్యర్థిని మాత్రం కేంద్ర నాయకత్వమే ఎంపిక చేస్తుంది. అనంతరం ఎన్‌డీఏ శాసనసభ పక్షం ఆ పేరును ఆమోదిస్తుంది" అని విజయ్ కుమార్ చౌధరీ పేర్కొన్నారు.

**బిహార్ తదుపరి సీఎం ఎవరు?**

ఇదిలా ఉండగా, బిహార్‌లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. చాలా కాలంగా సీఎం పదవిలో కొనసాగిన నీతీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లడంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. దీంతో బీజేపీ నుంచి ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపడతారనే విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, ఉప ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమారుడు, నిశాంత్ కుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ఉప ముఖ్యమంత్రిగా నిశాంత్ కుమార్!**

ఇటీవల నీతీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ కూడా జేడీయూ పార్టీలో చేరారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి లలన్ సింగ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ చౌదరి, సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ సభ్యుడిగా జేడీయూ బలోపేతానికి కృషి చేస్తానన్నానని పార్టీలో చేరిన అనంతరం నిశాంత్ చెప్పారు. రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే పార్టీ లక్ష్యమన్నారు. తన తండ్రి నీతీశ్ రాజ్యసభకు వెళ్లడం ఆయన తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, దానిని తాను స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. అయితే, ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్, నీతీశ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన కొన్ని రోజుల తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఇక తదుపరి బిహార్ ముఖ్యమంత్రి ఎవరనేది వేచి చూడాలి.

# ఇంటర్ ఫలితాలు విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

సెకండియర్‌లో 70.58 శాతం మంది స్టూడెంట్స్ పాస్ అయ్యారు. ఇందులో బాలికలు 74.4 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 57.69 శాతం మంది పాస్ అయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు 3,23,807 మంది విద్యార్థులు పాస్ కాగా.. ఇంటర్ సెకండియర్‌లో 5,07,494 లక్షల మంది పరీక్షలు రాయగా.. 3,58,490 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

హైదరాబాద్ నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయంలో పబ్లిక్ అఫైర్స్ ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు, విద్యా శాఖ సెక్రటరీ, తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్‌పర్సన్, శ్రీమతి యోగిత రాణా ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించగా.. రికార్డు స్థాయిలో మొత్తం 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆ తర్వాత మార్చి 15వ తేదీ నుంచి 20 కేంద్రాల్లో పరీక్ష పత్రాల మూల్యాంకనం మొదలై ఏప్రిల్ 1వ తేదీ నాటికి పూర్తి చేశారు.

ఏప్రిల్ 8వ తేదీ వరకు ఫలితాలకు సంబంధించిన అన్ని పనులను ముగించిన ఇంటర్ బోర్డు అధికారులు.. రికార్డు స్థాయి వేగంతో రిజల్ట్ విడుదలకు చర్యలు చేపట్టారు. ఇక 2026లో 9,97,075 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయగా.. అందులో మొదటి సంవత్సరం వారు 4,89,126 మంది.. రెండో సంవత్సరం వారు 5,07,949 మంది ఉన్నారని ఇంటర్ బోర్డు లెక్కలు చెబుతున్నాయి.

ఈసారి ఇంటర్మీడియట్ బోర్డు వాట్సాప్ ద్వారా కూడా రిజల్ట్ తెలుసుకునే ఏర్పాట్లు చేసింది. 8096958096 నంబర్‌కి వాట్సాప్‌లో హాయ్ మెసేజ్ పంపిస్తే.. అక్కడ కొన్ని ఆప్షన్స్ కనిపిస్తాయి. ఇంటర్ ఫలితాల మీద క్లిక్ చేయాలి. ఆ తర్వాత హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయగానే.. వెంటనే రిజల్ట్స్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. అక్కడే ఉన్న డౌన్‌లోడ్ ఆప్షన్‌ను క్లిక్ చేసి.. మార్క్స్‌షీట్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

**మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

ప్రస్తుతం ఇంటర్ బోర్డు ఫలితాలు విడుదల చేయగా.. మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయినవారు.. మే నెలలో సప్లిమెంటరీ పరీక్షలు రాసుకోవచ్చు. అదే నెల ఆఖరులోపు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను కూడా ప్రకటించాలని ఇంటర్ బోర్డు ప్రణాళికలు చేస్తోంది.

## మహిళల ఆకాంక్షలకు
# రిజర్వేషన్ బిల్లు ప్రతీక

**మొదటి పేజీ తరువాయి...**

అతీతంగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక అని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందే అని అన్నారు. డీలిమిటేషన్‌తో పార్లమెంట్‌లో స్థానాలు పెరుగుతాయి. ఈ బిల్లుతో తెలంగాణలోనూ 60 మంది మహిళలు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని అన్నారు.

## బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా
# మార్పు గురించి పరిశీలిస్తాం: కేటీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్పు గురించి పరిశీలిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్‌తెలిపారు. తమకు పొత్తులతో కలిసిరాదు, కుదరదుని కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్‌తో అసెంబ్లీ సీట్లు 179కి పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంపీ స్థానాలు 28కి పెరుగుతాయన్నారు. ఇతర రాష్ట్రాల పార్టీలు వస్తానంటే కాదనలేం అని తెలిపారు. గతంలో తాము కూడా మహారాష్ట్రకు వెళ్లామని గుర్తు చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా పాలించిన సీఎంలు : రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. మేధావులు అనుకున్న వాళ్లు ఇప్పుడు మాట్లాడటం లేదని అన్నారు. మళ్లీ తామ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు అన్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ బాగుండేదని పేర్కొన్నారు. తమను అడిగి ఉంటే క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం వదులుకునే వాళ్లమని అన్నారు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలించారని ప్రస్తావించారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్, చంద్రబాబు, కేసీఆర్ గొప్ప సీఎంలుగా అభివర్ణించారు.

లోపాలను సరిదిద్దుకుంటాం : కాంగ్రెస్ అన్ని పథకాల అమలులో ఫెయిల్ అయ్యిందని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు చిన్నచిన్న తప్పులు చేశామన్నారు. అప్పుడు ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరిగిందని తెలిపారు. గతంలో జరిగిన తప్పులపై అధ్యయనం చేశామని పేర్కొన్నారు. ఆ లోపాలను సరిదిద్దుకుంటామని వెల్లడించారు. ఈసారి వచ్చేది బీఆర్ఎస్సే అని కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని పునరుద్ఘాటించారు.

## సిలిగుఢి కారిడార్‌ను విడదీస్తామని
# 'తుక్డే-తుక్డే' గ్యాంగ్ బెదిరిస్తోంది: మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఉత్తర బంగాల్ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అదే క్రమంలో మదర్సాలకు సుమారు రూ. 6,000 కోట్లు కేటాయించారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల కనీస అవసరాలను విస్మరించి, బుజ్జగింపు రాజకీయాల్లో బిజీగా ఉందన్నారు. ఈశాన్య భారతాన్ని దేశాన్ని కలిపే వ్యూహాత్మకమైన సిలిగుఢి కారిడార్‌ను విడదీస్తామని 'తుక్డే-తుక్డే' ముఠా బెదిరిస్తోందన్నారు. అలాంటి వారికి టీఎంసీ తన బుజ్జగింపు రాజకీయాల కోసం వీధుల్లో నుంచి పార్లమెంటు వరకు మద్దతు ఇచ్చిందని ప్రధాని ఆరోపించారు. ఉత్తర బంగాల్ నగరమైన సిలిగుఢిలోని కవాఖాలి మైదానంలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించారు. ఈశాన్య ప్రాంతానికి ముఖద్వారంగా నిలిచే ఈ కారిడార్‌ను భారీ ఎత్తున అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

"దేశంలో ఒక 'తుక్డే-తుక్డే' గ్యాంగ్ ఉంది. అది సిలిగుఢి కారిడార్‌ను దేశం నుంచి విడదీస్తామని బెదిరిస్తోంది. వారు ఈశాన్య ప్రాంతాన్ని దేశం నుంచి వేరు చేయాలని కోరుకున్నారు. బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే టీఎంసీ, అటువంటి వ్యక్తులకు వీధుల నుంచి పార్లమెంటు వరకు మద్దతు ఇస్తోంది. అదే టీఎంసీ యొక్క నిజస్వరూపం. బీజేపీ దృష్టిలో సిలిగుఢి కారిడార్ అనేది దేశం, భద్రత, సమృద్ధికి సంబంధించిన ఒక కీలక మార్గం. ఈ ప్రాజెక్టు బంగాల్, సిక్కింలో రవాణా అనుసంధానాన్ని, వాణిజ్యాన్ని, పర్యాటకాన్ని భారీగా పెంపొందిస్తుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు టీఎంసీ అడ్డుపడుతోంది. ఉత్తర బంగాల్ పట్ల చూపుతున్న వివక్షకు టీఎంసీ ప్రభుత్వ బడ్జెట్ ఒక నిదర్శనం. ఈ క్రూరమైన ప్రభుత్వం మదర్సాల కోసం సుమారు రూ. 6,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. కానీ ఉత్తర బంగాల్‌లోని ఇంత విశాలమైన ప్రాంతం అభివృద్ధికి మాత్రం తగినంత బడ్జెట్‌ను కేటాయించడం లేదు. టీఎంసీ పగలు, రాత్రి తేడా లేకుండా తన సొంత ప్రత్యేక ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవడంలోనే నిమగ్నమై ఉంది. ఉత్తర బంగాల్‌లోని అనేక జిల్లాల్లో భారీ వర్షాల బీభత్సంతో అంతటా అల్లకల్లోలం నెలకొంది. ఆ సమయంలో ఈ టీఎంసీ ప్రభుత్వం కోల్‌కతాలో సంబరాలు చేసుకుంటోంది. టీఎంసీ అనేది ఉత్తర బంగాల్ వ్యతిరేక పార్టీ."

--నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

## క్యాతనపల్లిలో
# ప్రజాస్వామ్యం గెలిచింది

**మొదటి పేజీ తరువాయి...**

మదంతో కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. పోలీసులను అడ్డం పెట్టుకుని అడ్డమైన కేసులు పెట్టించి, బాల్క సుమన్‌ను జైలుకు పంపించారని పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఎన్ని అడ్డదారులు తొక్కినా.. ఎంత భయపెట్టినా.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు అదరలేదని అన్నారు. 51 రోజుల పాటు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా.. మొక్కవోని ధైర్యంతో అధికార బలానికి ఎదురొడ్డి నిలిచి బీఆర్ఎస్ కౌన్సిలర్లు పోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గెలిపించారని అన్నారు.

16 రోజుల పాటు క్యాతనపల్లి మున్సిపాలిటీ కోసం బాల్క సుమన్‌ను ఇబ్బంది పెట్టారని కేటీఆర్ అన్నారు. కానీ క్యాతనపల్లిలో ప్రజాస్వామ్యం గెలిచిందని కేటీఆర్ తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల తీర్పును కాలరాయాలని చూస్తున్నారని మండిపడ్డారు. బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి రాక్షసానందం పొందారని విమర్శించారు. అంతకుముందు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు.

సింగరేణి సంపదను కాపాడాల్సింది పోయి.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సైట్‌విజిట్ సర్టిఫికెట్ తెచ్చి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది కలిసి వేల కోట్ల సింగరేణి సంపదను కొల్లగొడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నీకు దమ్ముంటే నీ బామ్మర్దిపై సిట్, ఏసీబీ విచారణ జరిపించు అని సవాలు విసిరారు. బీజేపీ, కాంగ్రెస్ ఇద్దరూ తోడు దొంగలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి తన బావమరిదితో కలిసి సింగరేణిని కొల్లగొడుతుంటే.. బీజేపీ అడ్డుకోకుండా కాపాడుతుందని తెలిపారు. బీజేపీ ఎంపీలకు రేవంత్ రెడ్డి, రేవంత్ బామ్మర్దికి బీజేపీ టెండర్లు కట్టబెడుతూ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ అవినీతిపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కేవలం మాటలు చెబుతున్నారు తప్ప.. విచారణ జరిపించడం లేదని అన్నారు.

# హైదర్‌గూడ అగాపే ప్రేయర్ టెంపుల్‌లో భక్తి శ్రద్ధలతో అభిషేక తైల ప్రార్థనలు




రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి రెవరెండ్ బట్టు శ్రీకాంత్ లను సన్మానిస్తున్న అగాపే ప్రేయర్ టెంపుల్ పాస్టర్ రెవరెండ్ సోమారం రాజ్ కుమార్, సంఘ సభ్యులు

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం) :**

హైదర్గూడా అగాపే ప్రేయర్ టెంపుల్ లో ఆదివారం అభిషేక తైల ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. చర్చ్ పాస్టర్ సోమవారం రాజ్ కుమార్ అభిషేక తైల ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులైన ప్రతి ఒక్కరూ పరిశుద్ధాత్మ శక్తిని పొందుకోవాలని సూచించారు. అంతకుముందు బ్రదర్ డానియల్ దేవుని వల్ల కలిగే ఆశీర్వాదాల గురించి బైబిల్ లో చెప్పిన మాటలను వివరించారు. దేవుడు అనుగ్రహించే ఆశీర్వాదాలను పొందుకోవాలనుకుంటే వాక్యానుసారమైన జీవితాన్ని జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పాస్టర్ ఫెలోషిప్ నూతన అధ్యక్షులుగా నియమితులైన రెవరెండ్ సిహెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారిగా నియమితులైన రెవరెండ్ బట్టు శ్రీకాంత్ లను , వాక్య పరిచర్య చేసిన బ్రదర్ డానియల్ లను అగాపే ప్రేయర్ టెంపుల్ పాస్టర్ సోమారం రాజకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ కృష్ణవేణి రాజ్ కుమార్, సిస్టర్ షారాలత శాంసన్, బ్రదర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్ సిపాయి


ఆర్ నితిన్


బి చరణ్


పి రమేష్

## ఇంటర్ పరీక్షా ఫలితాలలో రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్ విద్యార్థుల ప్రతిభ

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివరాలను ప్రిన్సిపాల్ పార్వతి, వైస్ ప్రిన్సిపాల్ విజయేంధర్ రెడ్డి లు వెల్లడించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం లో ఆర్ సిపాయి అనే విద్యార్థి 1000 మార్కులకు గాను 989 మార్కులు సాదించి టాపర్ గా నిలిచారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఆర్ నితిన్ 1000 మార్కులకు గాను 986 మార్కులు సాదించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో పి రమేశ్ 500 మార్కులకు గాను 467 మార్కులు సాదించాడు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో బి చరణ్ 500 మార్కులకు గాను 433 మార్కులు సాదించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం లో 97.95శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 92.30 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. ఎం పీసీ ప్రథమ సంవత్సరంలో 98.03శాతం, బైపీసీ ప్రథమ సంవత్సరంలో 97.29శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాలు తెలిపారు.




కార్మికులకు గుర్తింపు కార్డులను అందచేస్తున్న
సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్, కన్యాగారి నరసింహ రెడ్డి, జె ఆనంద్ గౌడ్ లు

## ప్రతి కార్మికుడు కార్మికశాఖ అందజేసే గుర్తింపుకార్డులు తీసుకోవాలి:

### పుస్తకాల నర్సింగ్ రావు

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

భవన నిర్మాణ కార్మికులందరు కార్మికశాఖ అందజేసే గుర్తింపు కార్డులు అందుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. ఆదివారం బుద్వేల్ లో గల సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన కార్మికులకు కార్మికశాఖ అందజేసే గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ, లేబర్ అడ్డాల దగ్గర ఉండి పనులు చేసుకునే కార్మికులకు సీపీఐ ఆధ్వర్యంలో 100 కార్డులను ఇప్పించడం జరిగిందన్నారు. ఏఐటీయుసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్డులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రం గారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్, సీపీఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్, జె సదానందంగౌడ్, మండల కౌన్సిల్ సభ్యులు క్రిష్ణ, గంగారావు, మధు, నర్సింహ్మా, ఎం ఎన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ ఇంటర్‌లో జే.అక్షయ(993/1000) సాధించడంతో అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వి.ఎన్.అయ్యన్న బాబు

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్తాపూర్ శ్రీమేధా జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 12(నమస్తే ఉదయం)**

అత్తాపూర్ శ్రీ మేధా జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. 2025--26 ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభకనబరిచి, రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తాచాటారు. ఈ ఏడాది మొత్తం 32 రాష్ట్రస్థాయి ర్యాంకులను(టాప్ 10)లో కైవసం చేసుకున్నట్లు కళాశాల చైర్మన్ వి.ఎన్.అయ్యన్న బాబు తెలిపారు. సీనియర్ ఇంటర్మీడియట్‌లో జే.అక్షయ(993/1000), ఎన్.ఇమ్మాన్యుయేల్ స్టైయిన్స్(988/1000), అదిబా(986/1000), జూనియర్ ఎంపీసీలో సాయి కౌశిక్(466/470), హర్షిత్(466/470), రాజ్‌శ్రీ (465/470), జూనియర్ బైపీసీలో వినిల్ సర్వేష్ పి(436/440), ఎండి ఫహద్ ఆలీ(432/440), జూనియర్ సీఈసీలో ఆర్.షణ్ముఖ్(492/500), జూనియర్ ఎంఈసీలో హరిణి(487/500)లు సాధించినట్లు తెలిపారు. ఈ అసాధరణ ఫలితాలు తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కఠోర శ్రమకు నిదర్శనమని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ అద్భుతమైన ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన టీచింగ్, నాన్--టీచింగ్ సిబ్బందిని అభినందించారు. డైరెక్టర్ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ టాపర్లందరినీ ఘనంగా సన్మానించి వవారి భవిష్యత్తు మరింత విజయవంతంగా ఉండాలనా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం) :**



ఆత్మహత్య చేసుకున్న పల్లవి



కుటుంబ కలహాలతో గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాస్, పల్లవి (20) లు ప్రేమించుకుని రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. మహబూబ్ నగర్ నుంచి బతుకుతెరువు కోసం వలస వచ్చి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్డెన్ హైట్స్ లో నివాసం ఉంటూ దినసరికి కూలీలుగా పనిచేస్తున్నారు. వివాహం చేసుకున్న అనంతరం ఒక సంవత్సరం పాటు భర్త భార్యతో బాగానే ఉన్నాడు. ఈమధ్య తరచూ భార్య పల్లవి తో ప్రతి చిన్న విషయానికి భర్త శ్రీనివాస్ గొడవలు పడుతున్నాడు. పల్లవి తన బాధను తల్లిదండ్రులకు చెప్పుకోకుండా ఫోన్లో సైతం మాట్లాడించకుండ టార్చర్ చేస్తున్నాడు. దీంతో మనస్థాపం చెందిన పల్లవి ఆదివారం ఉదయం ఇంట్లోని ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. తమ బిడ్డ ఆత్మహత్యకు భర్త శ్రీనివాస్ కారణమని పల్లవి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# శివరాంపల్లిలో అగ్ని ప్రమాదం

## జనావాసాల మధ్య డెకరేషన్ గోదాములో చెలరేగిన మంటలు

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి లో ఆదివారం ఉదయం జనావాసాల మధ్య ఉన్న డెకరేషన్ గోదాము లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... శివరాంపల్లి లో కొత్త మహేశ్ రెడ్డి కి 500 గజాల ఒపెన్ స్థలం ఉంది. అది ఇళ్ల మధ్యలో ఉంది. దానిని ఆయన డైమండ్ ఫ్లవర్ డెకరేషన్ యజమాని జహంగీర్ కు అద్దెకు ఇవ్వగా అందులో జహంగీర్ షెడ్డు వేసి డెకరేషన్ సామాగ్రిని నిల్వ చేశాడు. గోదాములో ప్లాస్టిక్ డెకరేషన్ వస్తువులు, ఫెక్సీలు, ధర్మకోల్ సామాగ్రి ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. గోదాం పక్కనే ఉన్న విశ్రాంత ఎస్ఐ వి జీవన్స్ ఇంటి పై అంతస్థు కూడా వేడికి పూర్తిగా పాడైపోయింది. నల్లటి పొగతో ఇళ్లంతా నిండిపోయింది. మంటల దాటికి గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోదాము కు పక్కన ఉన్న ఇళ్లలలోనుంచి ప్రజలు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరుగకపోయినా, ఆస్థినష్టం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ప్రమాదంతో శివరాంపల్లి లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నాలుగు ఫైరింజన్లు. సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. శివరాంపల్లి ప్రజలు మాట్లాడుతూ, జనావాసాల మధ్య అక్రమ గోదాములు ఏర్పాటు చేయడానికి స్థలమిచ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు నివాసాం ఉండే ఇండ్ల మధ్య భారీ గోదామ లకు షెడ్డు స్థలం ఇచ్చి లక్షలు గడిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

శివరామపల్లి లో డెకరేషన్ గోదాము లో ఎగసి పడుతున్న మంటలు



హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న బుద్వేల్ హైందవ సోదరులు

## హిందూ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలి: కమిటీ అధ్యక్షులు బి కుమార్

### ఈనెల 19న బుద్వేల్ లో హిందూ సమ్మేళనం

### శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులకు ఆహ్వాన పత్రిక అందజేసిన నిర్వాహకులు

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

హిందూ ఐక్యతను బలోపేతం చేయడం,సాంప్రదాయ విలువలను కాపాడడం లక్ష్యంగా రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్‌లో ఈ నెల 19న సాయంత్రం 5:30 గంటలకు శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు సమ్మేళన కమిటీ అధ్యక్షులు బి.కుమార్,ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు సి.చంద్రమౌళి గౌడ్, బండారి బాలకృష్ణ,తెలిపారు.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులకు హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో హిందూ భక్తులు,ప్రజలు హాజరుకావాలని కోరుతున్నారు.గ్రామస్థుల్లో ఇప్పటికే ఈ కార్యక్రమంపై విశేష ఆసక్తి నెలకొంది. హిందూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, సాంస్కృతిక పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా

శ్రీశ్రీశ్రీ శంకర్ స్వామీజీ శ్రీమాణికేశ మహాసంస్థానం దామర్చేడ్,తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, బ్రహ్మర్షి రేవల్లి రాజుశర్మ చండీ ఉపాసకులు భక్తిటీవీ కోటి దీపోత్సవ ప్రధాన పురోహితులు,ముఖ్య వక్త డాక్టర్.వేద ప్రకాష్,మహిళ వక్త జి.ప్రసన్నలక్ష్మి,

ప్రముఖులు పాల్గొని హిందూ ధర్మ పరిరక్షణ,సంస్కృతి గొప్పతనం,యువత బాధ్యతలపై ప్రసంగాలు చేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించేందుకు నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు. సమ్మేళనం శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో బుద్వేల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు కోరని శ్యామ్,కోరని నరేందర్,దేవులపల్లి భాస్కరరావు, ఓగిరాల హరికిషన్,ఎం. సురేష్,రమేష్,రిపోర్టర్ రామకృష్ణ,రాజేందర్,నర్సింగ్ రావు, దయానంద్,సమ్మేళనం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



తన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కల్పన జాన్



ఆరుష్ చేత కేక్ కట్ చేయిస్తున్న తల్లి తండ్రులు విజేత, పాల్ లు

## ఘనంగా ఆరుష్ జన్మ దిన వేడుకలు

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

హైదర్ గూడ కు చెందిన బ్రదర్ పాల్, సిస్టర్ విజేత ల కుమారుడు ఆరుష్ మొదటి జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక అగాపే ప్రేయర్ టెంపుల్ లో ఘనంగా జరిగాయి. చర్చ్ పాస్టర్ రెవరెండ్ సోమారం రాజ్ కుమార్ ప్రార్థనల మధ్య ఆరుష్ చేత కేక్ కట్ చేయించారు. ఆరుష్ కోసం ప్రార్థన లు చేశారు.

**చర్చ్ సభ్యుల మధ్య కల్పన జాన్ జన్మదిన వేడుకలు**

అగాపే ప్రేయర్ టెంపుల్ కు చెందిన సిస్టర్ కల్పన జాన్ జన్మదిన వేడుకలు ఆదివారం చర్చ్ సభ్యుల మధ్య నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరంగా పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేసి అందరు కలిసి బోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ కృష్ణవేణి రాజ్ కుమార్, సిస్టర్ షారాలత శాంసన్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి రెవరెండ్ బట్టు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై దాడులు, ముగ్గురు అరెస్ట్

**బుద్వేల్, ఏప్రిల్ 12 (నమస్తే ఉదయం)**

బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ, నేతాజీ నగర్ ప్రాంతాలలో అనధికారికంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు చేస్తున్న ముగ్గురు వ్యకు లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం... బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీలో సోమ అనిల్ గౌడ్ (37) బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయాలు చేస్తుండగా ఏక్రైజ్ పోలీసులు దాడులు చేసి 5.950 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో ఇ హరిశంకర్ గౌడ్ (43) బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయిస్తుండగా దాడులు చేసిన పోలీసులు 4.320 లీటర్ల మద్యం ను స్వాధీనం చేసుకున్నారు. నేతాజీనగర్ లో పి శ్రీనివాస్ (36) బెల్టు షాపు నిర్వహిస్తుం డగా దాడులు చేసి అతని నుంచి 9.980 లీటర్ల మద్యం ను స్వాధీనం చేసుకున్నారు.

# నిఘా నీడన 'నిమ్మకు నీరెత్తినట్లు

## సైబరాబాద్‌లో ఖాకీల మిలాఖత్' రాజకీయం!



**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 13, (నమస్తే ఉదయం)**

పోలీసు వ్యవస్థలో 'కళ్ళు, చెవులు'గా భావించే నిఘా విభాగాలు ఇప్పుడు తమ అసలు విధిని విస్మరించి, క్షేత్రస్థాయి అధికారులతో 'దోస్తీ' చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులతో కుమ్మక్కవుతున్న తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. "మీది తెనాలి.. మాది తెనాలి" అన్న చందంగా, ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉన్నామనే సాకుతో అక్రమాలను కప్పిపుచ్చుతున్నారనేది బహిరంగ రహస్యంగా మారింది.

**వ్యవస్థ నిర్మాణం - అసలు బాధ్యతలు**

సాధారణంగా పోలీస్ వ్యవస్థలో నిఘా విభాగాలు అత్యంత కీలకమైనవి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు (ఎస్బీ) ఉంటారు. ఒక సబ్-డివిజన్ స్థాయికి సీఐ ర్యాంక్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. వీరి ప్రధాన విధులు పాస్పోర్ట్, జాబ్ ఎంక్వైరీ చేయడంతో పాటు పోలీసులు స్టేషన్ కు వచ్చే బాధితులకున్యాయం జరుగుతుందా! లేక పోలీసు సిబ్బంది అధికారులు వేధింపులకు గురి చేయడం డబ్బులు దండుకోవడం చేస్తుంటే ఉన్నతాధికారులకు నివేదికలో ఇవ్వడం తోపాటు రాజకీయ కదలికలు స్థానిక రాజకీయ నేతల కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై కన్నేసి ఉంచడం.

**అంతర్గత నిఘా**

పోలీస్ స్టేషన్లలో ఎస్.హెచ్.ఓలు, ఎస్.ఐలు, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? వారు బాధితులతో ఎలా వ్యవహరిస్తున్నారు? నిరంతరం నిఘా ఉండడం తోపాటు సమాచారన్ని ఉన్నతాధికారులకు అందించాలి. బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేయడం, కేసులను నీరుగార్చడం వంటి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు పంపడం వీరి బాధ్యత.

**భాగస్వాములయ్యి!**

నిబంధనల ప్రకారం సివిల్ పోలీసుల తప్పులను ఎండగట్టాల్సిన నిఘా విభాగం అధికారులు, ఇప్పుడు వారితోనే 'చెట్టాపట్టాలేసుకుని' తిరుగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎస్.బి అంటే స్టేషన్ సిబ్బందికి వణుకు ఉండేది. తాము చేసే చిన్న తప్పు కూడా పై అధికారులకు వెళ్తుందన్న భయం ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. స్టేషన్లలో జరిగే అక్రమ లావాదేవీలు, సెటిల్‌మెంట్లు నిఘా అధికారుల కళ్లముందే జరుగుతున్నా, వారు మౌనం వహిస్తున్నారు. స్పెషల్ బ్రాంచ్ లో పనిచేసే వారు సివిల్ పోలీసులే కావడంతో ఇరువర్గాల మధ్య లోపాయికార ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోజు మీరు స్పెషల్ బ్రాంచ్ ఉండవచ్చు రేపు నేను అదే విభాగానికి వస్తాను. అప్పుడు నీమీద నేను పిర్యాదు చేస్తాను. ఒకరిపై ఒకరం పిర్యాదు చేసుకోవడం వలన వచ్చేది ఏమి ఉండదు రిమార్కులు తప్పా అంటు సంధి చేసుకున్నట్లు తెలిసింది. దానికి తోడు పోలీసు స్టేషన్ లో జరిగే డిఎస్ఆర్ వివరాలు మీకు ఇచ్చేదే లేదు అంటు కొందరు సీఐలు స్పెషల్ బ్రాంచ్ పోలీసులను బెదిరించినట్లు ప్రచారం జరుగుతుంది. దాంతో పాటు జరిగిన క్రై ఇతర సమాచారం సకాలంలో ఇవ్వక పోతే మీకు చార్జ్ మెమోలు వస్తాయి మీ ఇష్టంయని ఇరువురం కలిసి ఉంటే కలదు సుఖం అన్న పార్మాలను అనుచరిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. గతంలో ఎస్బీ సిబ్బంది వస్తున్నరంటే పోలీసు స్టేషన్లో సిబ్బంది అధికారు భయపడేవారు. ప్రస్తుతం పరిస్థితులు అలా లేవు నువ్వు నేను భాయి భాయి అన్నట్లు తయారైయింది. ప్రతిరోజూ పంపాల్సిన నివేదికల్లో క్షేత్రస్థాయి వాస్తవాలు ఉండటం లేదు. అంతా సవ్యంగానే ఉందన్నట్లుగా 'ఆల్ ఈజ్ వెల్' రిపోర్టులు పంపుతూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**బాధితుల గోడు పట్టదు**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను వేధించడం, లంచాలు అడగడం వంటి అంశాలు నిఘా అధికారులకు తెలిసినా, వారు "మన డిపార్ట్‌మెంటే కదా" అని సర్దుకుపోతున్నారు.

"మీది తెనాలి.. మాది తెనాలి" సంస్కృతి కొన్ని రోజులు నిఘా విభాగంలో ఉంటాం, మళ్ళీ సివిల్ పోలీసింగ్‌కు వెళ్లాల్సిందే కదా" అన్న ధోరణి అధికారుల్లో పెరిగిపోయింది. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటే రేపు తాము స్టేషన్‌కు వెళ్ళినప్పుడు ఇబ్బందులు ఎదురవుతాయని వారు భావిస్తున్నారు. ఈ 'రాజీ' ధోరణి వల్ల పోలీస్ వ్యవస్థలో జవాబుదారీతనం లోపిస్తోంది. గతంలో మాదాపూర్ డివిజన్ పని చేసిన ఓ అధికారి ఈ సంస్కృతి శ్రీకారం చూట్టినట్లు అపట్లో బాగా ప్రచారం జరిగింది. తన బ్యాచ్మెంట్లకు సహకరించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ప్రస్తుతం సివిల్, ఎస్బి పోలీసులు భాయి భాయి అంటూ కలసి ఉంటే కలదు సుఖం నడిపించేస్తున్నారు.

**స్టేట్ ఇంటెలిజెన్స్ అదే దొరణి**

స్టేట్ ఇంటెలిజెన్స్ అంటే కేవలం రాజకీయ సమాచారం సేకరించడం మాత్రమే కాదు, ఆయా శాఖలోని కుళ్ళిపోయిన వ్యవస్థను ప్రక్షాళన చేయడం కూడా. కానీ ఇప్పుడు ఇంటెలిజెన్స్ అధికారులు రాజకీయ నాయకులకు, అవినీతి అధికారులకు మధ్య 'వారధి'గా మారుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లని అక్రమాలు**

సివిల్ పోలీసులు చేస్తున్న అక్రమ సెటిల్‌మెంట్లు, భూకబ్జాల్లో జోక్యం అక్రమార్కులతో సంబంధాలు వంటివి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదు. మున్సిపల్, రెవిన్యూ అధికారులపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాల్సిన వారే వారికి రక్షణ కవచంలా మారుతుండటమే. ఈ 'మిలాఖత్' రాజకీయం వల్ల నిజాయితీగా పనిచేసే అధికారులకు గుర్తింపు లేకుండా పోతోంది.

**మార్పు ఎప్పుడు ఎలా సాధ్యం?**

సైబరాబాద్ వంటి కీలక ప్రాంతంలో నిఘా వ్యవస్థ నీరుగారిపోతే అది శాంతిభద్రతలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఉన్నతాధికారులు నిఘా విభాగాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**నిఘా విభాగాల్లో పనిచేసే వారిని క్రమం తప్పకుండా మార్చాలి.**

స్పెషల్ బ్రాంచ్ ఇంటిలిజెన్స్ విభాగం లలో ఏఆర్, స్పెషల్ పోలీసుల సేవలను ఉపయోగించుకుంటే పోలీసు శాఖకు పేరు తోపాటు ఆశించిన ఫలితాలు వస్తాయని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. వారిచ్చే నివేదికల వాస్తవ రూపంపై రహస్యంగా మరో బృందంతో తనిఖీ చేయించాలి.

అవినీతికి సహకరించే నిఘా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే పోలీసు వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం కలుగుతుంది. లేదంటే, "రక్షకులే భక్షకులుగా" మారిన తీరును నిఘా వర్గాలు మౌనంగా వీక్షిస్తూనే ఉంటాయి.



బొడ్రాయి పూజల్లో పాల్గొన్న అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్

## రాజీవ్ నగర్‌లో భక్తిశ్రద్ధలతో వైభవంగా బొడ్రాయి పండుగ

**శేరిలింగంపల్లి ,ఏప్రిల్ 13, (నమస్తే ఉదయం )**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ బస్తీలోని బొడ్రాయి పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. బస్తీ వాసుల ప్రత్యేక ఆహ్వానం మేరకు అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ వేడుకల్లో పాల్గొని, స్థానిక నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అంజనెయులుకి బస్తీ వాసులు ఘనస్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు సమాజానికి బలమైన పునాదులని కొనియాడారు. దేవాలయాలు కేవలం భక్తికే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయి. ఇలాంటి పండుగలు మన మధ్య స్నేహభావాన్ని పెంపొందించి, సమాజాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, సమాజ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బొడ్రాయి పండుగను ఇంత ఘనంగా నిర్వహించినందుకు బస్తీ వాసులను అంజనేయులు సాగర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పి. లక్ష్మయ్య సాగర్, అల్లకుంట తిరుపతయ్య, గోలుసుల నర్సింహా, నర్రా సాయులు, పి. పాండు, పి. యాదయ్య, పి. వెంకటేశ్వర్లు, పి. దశరథ్ ఈ. రాజు, కే. జోగులు, జి. రాము డి. యాదయ్య, డి. శ్రీను, బి. వెంకటేష్, ఏ. మల్లేష్ తోపాటు పెద్ద సంఖ్యలో బస్తీ ప్రజలు భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని నేతలు ఆకాంక్షించారు.

## గద్వాల జిల్లా ఇంటర్ ఒకేషనల్ పరీక్షలో ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

### శ్రీ విద్య ఒకేషనల్ జూనియర్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(నమస్తే ఉదయం)**



డి. ప్రణిత - 493



కె. క్రిష్ణ వేణి-977,

గద్వాల పట్టణ కేంద్రానికి చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఆదివారం వెలువడిన ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల నందు గద్యాలలోని శ్రీ విద్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులను సాధించడంతో పాటు అత్యధిక ఉత్తర్ణతతో కూడిన ఫలితాలను సాధించి విజయకేతనం ఎగుర వేశారు.




ప్రథమ సంవత్సర ఫలితాలలో 500 మార్కులకు గాను డి. ప్రణిత - 493, హెచ్. సలోమి-486, జి స్నేహ-487, కృపామతి -479, రిమ్స తబుసుమ్ -477 మార్కులతో పాటు మొత్తం 53 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాలతో 1000 మార్కులకు గాను కె. క్రిష్ణ వేణి-977, కావేరి -967, శావణి -966, లబీబ-960, త్రివేణి -960, రమేష్ -955 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ మహమ్మద్ అజాం, ప్రిన్సిపాల్ నరేంధర్, వైస్ ప్రిన్సిపాల్ విశాల్ , కళాశాల అధ్యాపక బృంధం అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

## ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేస్తుంది: ఎమ్మెల్యే జిఎంఆర్



ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, ఏప్రిల్ 12(నమస్తే ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం, కనిమెట్ట, పాలెం గ్రామాలలో పలు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించాలని లక్ష్యంతో ముందుకు వెళుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, తమ సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జియంఆర్ కి వారు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలు అందజేశారు.



## ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు: సర్పంచ్ ఏం శ్రీనివాసులు

**కొత్తకోట, ఏప్రిల్ 12(నమస్తే ఉదయం)**

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం చేస్తాయని కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామం సర్పంచ్ ఎం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలం లోని రామకృష్ణాపురం గ్రామంలో పెబ్బేరు పట్టణానికి చెందిన జననీ హాస్పిటల్ యజమాన్య ఆధ్వర్యంలోగర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల ప్రత్యేక వైద్యం డాక్టర్ జయ చంద్రారెడ్డి ,డాక్టర్ ప్రియాంక రెడ్డి లుఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు మూల ములో యుగంధర్ రెడ్డి ఉప సర్పంచ్ ఎండి తాహెర్, ఎండి అబీబ్, మాజీ ఉప సర్పంచ్ శివ ప్రసాద్ , వార్డు సభ్యులు మోహన్ బాబు , నాయకులు భరత్ యాదవ్, శ్రీను ,నరసింహ ,మొగులన్న, కొల్లం రాములు, బత్తుల సుధాకర్, మధుగంనరసింహ లు పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి

**కొత్తకోట, ఏప్రిల్ 12 ( నమస్తే ఉదయం)**

మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో మధుగం శ్రీనివాసులు, మధుగం భారతయ్య లు నూతనంగా నిర్మించుకున్న గృహానికి గృహప్రవేశ పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు , బి ఆర్ ఎస్ మూలమల్ల యుగంధర్ రెడ్డి , విక్రమ్ సింహారెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చన్న, సత్య రెడ్డి ,మాజీ ఉప సర్పంచ్ జగదీష్, శివప్రసాద్, నాయకులు భరత్ యాదవ్, జయరాజు ,బత్తుల శ్రీను, బండారి నరసింహ, ఆంజనేయులు, అమ్మపురం భరత్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆటను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## గెలిస్తే గర్వం... ఓడితే నిరాశ చెందొద్దు: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, ఏప్రిల్ 12(నమస్తే ఉదయం)**

కొత్తకోట మండల కేంద్రంలో ఎమ్మెల్యే జిఎంఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన జిఎంఆర్ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని. టాస్ వేసే బ్యాటింగ్ చేసి యువకులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గెలుపోటములను పక్కనపెట్టి యువకులు క్రీడల్లో రాణించాలని గెలిస్తే గర్వం, ఓడితే నిరాశ పడకూడదు అన్నారు ఈ కార్యక్రమంలో మదనపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పల్లపాగ ప్రశాంత్ , కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాస్ , కొత్తకోట మండల పార్టీ అధ్యక్షులు నాగారపు బీచుపల్లి యాదవ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, పాపయ్య గారి కృష్ణారెడ్డి , నారామోన్ బోయేజ్ , మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు , చర్లపల్లి మాజీ సర్పంచ్ సూది రెడ్డి శేఖర్ రెడ్డి , జిల్లా రైతు నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి , పార్టీ మండల జనరల్ సెక్రెటరీ ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కొత్తకోట మున్సిపల్ కౌన్సిలర్లు, కొత్తకోట మండల వివిధ గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733